

'కాళేశ్వరం'లో ట్రెయినీ కలెక్టర్లు

కాళేశ్వరం ప్రాజెక్టును ట్రెయినీ కలెక్టర్లు సౌరభ్ శర్మ, నలోని చోప్రా, హర్ష చౌదరి, కెరోలిన్ చింగ్తయానమావి, ప్రణయ్ కుమార్ బృందం సందర్శించింది.

- 8లో▸



రెండు గంటలు..30 మంది అధికారులు

సౌత్ వెస్ట్రన్ రైల్వే, దక్షిణ మధ్య రైల్వేకు చెందిన దాదాపు 30 మంది బృందం సభ్యులు కాజీపేట రైల్వేస్టేషన్‌లో తనిఖీలు నిర్వహించారు.

- 8లో▸

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం

$34^0/26^0$

జిల్లాలో ఉదయం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం సాధారణంగా ఉంటుంది. సాయంత్రం వేళ ఉరుములు, మెరుపులతో వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

భూభారతి చట్టంతో భూసమస్యల పరిష్కారం



దుగ్గొండి: ప్రభుత్వం నూతనంగా తీసుకువచ్చిన భూభారతి చట్టంతో రైతుల భూముల సమస్యలు పరిష్కారమవుతాయని నర్సంపేట ఆర్డీఓ ఉమారాణి అన్నారు. మండలంలోని ముద్దునూరు, పోలారం గ్రామాల్లో గురువారం రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా ముద్దునూరు రెవెన్యూ సదస్సును ఆర్డీఓ ఉమారాణి పరిశీలించారు. రైతులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. రైతుల సాదాబైనామా, ఆర్ఓఆర్‌లో తప్పులు సరిచేయడం, సర్వేనంబర్ మిస్సింగ్ లాంటి సమస్యలు పరిష్కరించనున్నట్లు ఆమె తెలిపారు. తహసీల్దార్ రాజేశ్వర్‌రావు, డీటీ ఉమ, ఆర్ఐలు రాంబాబు, మల్లయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన కల్పించాలి



సంగెం: సైబర్ నేరాలు, రోడ్డు ప్రమాదాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఈస్ట్‌జోన్ డీసీపీ అంకిత్‌కుమార్ సూచించారు. మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌ను గురువారం సాయంత్రం ఆయన ఆకస్మికంగా సందర్శించారు. పోలీస్ స్టేషన్ పరిసరాలు, రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాదక ద్రవ్యాలు, చట్టవ్యతిరేక కార్యకలాపాలపై గట్టి నిఘా పెట్టాలని సిబ్బందిని ఆదేశించారు. డీసీపీ వెంట మామునూరు ఏసీపీ వెంకటేశ్, పర్వతగిరి సీఐ రాజగోపాల్, సంగెం ఎస్సై నరేశ్ ఉన్నారు.

నకిలీ పత్తి విత్తనాల పట్టివేత

నర్సంపేట: నకిలీ పత్తి విత్తనాలను టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్న సంఘటన చెన్నారావుపేట మండలంలోని జల్లి గ్రామంలో గురువారం వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన నూనె స్వామి బీజీ త్రీ బీటీ నకిలీ పత్తి విత్తనాలను తయారు చేస్తున్నాడు. కిలోకు రూ.మూడు వేల చొప్పున గ్రామానికి చెందిన ఐదుగురు రైతులకు 14 కిలోల వరకు విత్తనాలు విక్రయించాడు. విశ్వసనీయ సమాచారం మేరకు దాడులు చేసి నాలుగు కిలోల విత్తనాలను అతడి నుంచి స్వాధీనం చేసుకుని చెన్నారావుపేట పోలీసులకు అప్పగించారు. ఈ మేరకు మండల వ్యవసాయ అధికారి గోపాల్‌రెడ్డి ఫిర్యాదు మేరకు నూనె స్వామిపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు చెన్నారావుపేట ఎస్సై రాజేశ్‌రెడ్డి తెలిపారు.

అంగన్‌వాడీలు మెరుగైన సేవలందించాలి



వర్ధన్నపేట: చిన్నారుల బంగారు భవిష్యత్‌కు అంగవాడీ కేంద్రాలే పునాదులని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు అన్నారు. వర్ధన్నపేటలోని ఫిరంగిగడ్డ అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం అమ్మ మాట–అంగన్‌వాడీ బాట కార్యక్రమాన్ని ఎమ్మెల్యే నాగరాజు ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన చిన్నారులకు స్వయంగా అక్షరాభ్యాసం చేయించారు. అనంతరం ఎమ్మెల్యే నాగరాజు మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలు, గర్భిణులకు మెరుగైన సేవలందించాలని కార్యకర్తలను సూచించారు. అంగన్‌వాడీల్లో చేరిన పిల్లలు ప్రభుత్వ పాఠశాలలో విద్యనభ్యసించేలా చూడాలని అధికారులు, తల్లిదండ్రులను కోరారు. కార్యక్రమంలో డీడబ్ల్యూఓ రాజమణి, వర్ధన్నపేట ఏఎంసీ చైర్మన్ నరకుడు వెంకటయ్య, వర్ధన్నపేట సీడీపీఓ దేహోర తదితరులు పాల్గొన్నారు.

నేటినుంచి జాతీయ వర్క్‌షాప్

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలో జువాలజీ విభాగం ఆధ్వర్యాన ఈనెల 13 నుంచి 15వ తేదీ వరకు జాతీయ వర్క్‌షాప్ నిర్వహిస్తున్నట్లు ఆ విభాగం అధిపతి ఆచార్య జి.షమిత తెలిపారు. 'హ్యాండ్ ఆన్ మాలిక్యులర్ డాకింగ్ అండ్ డ్రగ్ డిస్కవరీ టెక్నిక్స్' అనే అంశంపై జువాలజీ సెమినార్ హాల్‌లో నిర్వహించే ఈ వర్క్‌షాప్ ప్రారంభం సమావేశంలో కేయూ వీసీ ప్రతాప్‌రెడ్డితోపాటు సైన్స్ డీన్ జి.హనుమంతు, ఆర్గనైజింగ్ సెక్రటరీ మామిడాల ఇస్తారి, కన్వీనర్ వై.వెంకయ్య, బీఓఎస్ ఈసం నారాయణ పాల్గొంటారని ఒక ప్రకటనలో పేర్కొన్నారు.



వరంగల్ శంభునిపేట ప్రభుత్వ పాఠశాలలో గంట కొడుతున్న సిబ్బంది



కరీమాబాద్ ప్రభుత్వ పాఠశాల ఆవరణలో విద్యార్థులు

మోగిన బడిగంట

జిల్లాలో పునఃప్రారంభమైన పాఠశాలలు

- విద్యార్థులకు స్వాగతం పలికిన ఉపాధ్యాయులు
- మొదటి రోజు యూనిఫాం, పుస్తకాల పంపిణీ

విద్యారణ్యపురి: వేసవి సెలవుల్లో ఆటపాటలతో గడిపిన విద్యార్థులు గురువారం బడిబాట పట్టారు. పండుగ వాతావరణంలో ప్రభుత్వ పాఠశాలలకు వచ్చిన విద్యార్థులకు ఉపాధ్యాయులు పూలతో ఘన స్వాగతం పలికారు. పలు పాఠశాలలను మామిడి తోరణాలు, అరటి ఆకులు, పూలు, బెలూన్లతో అలంకరించారు. హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు విద్యార్థులను ఆప్యాయంగా పలకరించి ఆహ్వానించారు. బడిబాట కార్యక్రమంలో భాగంగా పాఠశాలల్లో విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశాలు కూడా నిర్వహించారు.



కరీమాబాద్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులతో ప్రార్థన చేయిస్తున్న ఉపాధ్యాయులు

పలు పాఠశాలలను సందర్శించిన కలెక్టర్, అధికారులు

వర్ధన్నపేట మండలం ల్యాబర్తి ప్రభుత్వ పాఠశాల, ఖిలా వరంగల్ మండలం గుంటూరుపల్లి ప్రభుత్వ పాఠశాలను కలెక్టర్ డాక్టర్ సత్యశారద సందర్శించారు. విద్యార్థులకు యూనిఫాం పంపిణీ చేశారు. అదేవిధంగా సంగెం మండలం మొండ్రాయిలోని జెడ్పీహెచ్‌ఎస్, పల్లారుగూడలోని యూపీఎస్‌ను జిల్లా కమ్యూనిటీ మొబిలైజింగ్ కోఆర్డినేటర్ కె.సుభాష్ పరిశీలించారు. విద్యార్థుల తల్లిదండ్రుల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. అలాగే, విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, స్కూల్ యూనిఫామ్ అందజేశారు. వరంగల్‌లోని కృష్ణా కాలనీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 300 మంది విద్యార్థులకు 150 మంది విద్యార్థులు హాజరయ్యారు. వీరికి ఎంఈఓ గంపా అశోక్‌కుమార్, ఉపాధ్యాయులు పుస్తకాలు, స్కూల్ యూనిఫామ్ అందజేశారు. జిల్లా క్వాలిటీ కోఆర్డినేటర్ సుజన్‌తేజ పలు పాఠశాలలను పర్యవేక్షించారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య : కలెక్టర్ సత్యశారద



వర్ధన్నపేట : ల్యాబర్తి ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థినికి యూనిఫామ్ అందజేస్తున్న కలెక్టర్ సత్యశారద

వర్ధన్నపేట: ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యార్థులకు మెరుగైన వసతులతోపాటు నాణ్యమైన విద్య అందుతుందని కలెక్టర్ సత్యశారద తెలిపారు. మండలంలోని ల్యాబర్తి ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు యూనిఫామ్, పుస్తకాలు పంపిణీ చేశారు. అనంతరం తల్లిదండ్రులు, ఉపాధ్యాయులతో నిర్వహించిన బడిబాట కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడారు. ప్రైవేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు పనిచేస్తున్నాయని పేర్కొన్నారు. గత సంవత్సరం పదో తరగతిలో 100 శాతం ఫలితాలు సాధించిన ఒదుకు విద్యార్థులు, ఉపాధ్యాయలను అభినందించారు. ఈ సంవత్సరం కూడా విద్యార్థులకు చదువుతోపాటు స్కిల్ డెవలప్‌మెంట్ తదితర అంశాలపై అవగాహన కల్పించాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి జ్ఞానేశ్వర్, వర్ధన్నపేట తహసీల్దార్ విద్యాసాగర్, ఎంఈఓ శ్రీధర్, ఎంపీడీఓ అరుంధతి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

బడిబాటను విజయవంతం చేయాలి

ఖిలా వరంగల్: తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని కలెక్టర్ డాక్టర్ సత్యశారద సూచించారు. ఖిలా వరంగల్ మండల పరిధి గుంటూరుపల్లిలోని మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలను కలెక్టర్ సత్యశారద, ఆర్డీఓ సత్యపాల్‌రెడ్డి, తహసీల్దార్ బండి నాగేశ్వర్‌రావు సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ బడిబాట కార్యక్రమాన్ని ప్రారంభించి, విద్యార్థులకు యూనిఫామ్, బుక్స్ పంపిణీ చేసి మాట్లాడారు. ఈనెల 6వ తేదీ నుంచి 19 వరకు బడిబాట కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పాఠశాల పునఃప్రారంభమైన సందర్భంగా ఉపాధ్యాయులు, విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు. ఐదు సంవత్సరాలు నిండిన చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలని, బడి బయట ఉన్న విద్యార్థులను గుర్తించి తిరిగి బడికి వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో విద్యాబోధన చేయాలని, వార్షిక పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించేందుకు కృషి చేయాలని ఆదేశించారు. అంతకుముందు నూతనంగా బడిలో చేరిన విద్యార్థులకు అడ్మిషన్ ఫారాలు అందించారు. కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్ ఓ రమేశ్, ఎస్సైలు శ్రీకాంత్, కృష్ణవేణి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పూలు, మామిడి తోరణాలతో పాఠశాలల అలంకరణ

గీసుకొండ: మండలంలోని వంచనగిరి, గీసుకొండ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల విద్యార్థులకు గురువారం ఉపాధ్యాయులు వినూత్నంగా స్వాగతం పలికారు. వంచనగిరి పాఠశాల ముఖద్వారాన్ని అరటి ఆకులు, బంతిపూల దండలతో అలంకరించి చిన్నారులకు స్వాగతం పలికారు. గీసుకొండ పాఠశాలలో ఉపాధ్యాయులు రెండు వైపులా నిలబడి పాటలు వినిపిస్తూ విద్యార్థులపై పూలు చల్లి ఆహ్వానించారు.



వంచనగిరి బడి ముఖద్వారానికి మామిడి తోరణాలు కట్టి విద్యార్థులకు స్వాగతం పలికిన ఉపాధ్యాయులు

సర్కారు స్కూళ్లను బలోపేతం చేయాలి

- జిల్లా అకడమిక్ మానిటరింగ్ అధికారి సుజన్‌తేజ



గీసుకొండ: గంగదేవిపల్లిలో మాట్లాడుతున్న ఏఎంఓ సుజన్‌తేజ

గీసుకొండ/నర్సంపేట: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను చేర్పిస్తే బంగారు భవిష్యత్ ఉంటుందని జిల్లా అకడమిక్ మానిటరింగ్ అధికారి (ఏఎంఓ) సుజన్‌తేజ అన్నారు. గీసుకొండ మండలంలోని గంగదేవిపల్లి, చెన్నారావుపేట మండలంలోని పలు గ్రామాల్లో పొదుపు సంఘాల మహిళలతో గురువారం ఏర్పాటు చేసిన సమావేశాల్లో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలని సూచించారు. గంగదేవిపల్లి పాఠశాల హెచ్‌ఎం అబ్దుల్ రజాక్ మాట్లాడుతూ పదో తరగతిలో విద్యార్థులు అత్యధిక మార్కులు సాధించారని పేర్కొన్నారు. అదేవిధంగా చెన్నారావుపేటలో జరిగిన బడిబాట కార్యక్రమంలో ఏఎంఓ సుజన్‌తేజ, మండల విద్యాశాఖ అధికారి బైరి సరళ, మండల ప్రాజెక్టు మేనేజర్ ముక్కెర ఈశ్వర్, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.మండలంలోని పలు పాఠశాలలను సందర్శించారు. ఎమ్మార్సీ కార్యాలయంలో పాఠ్యపుస్తకాలు, రికార్డులను పరిశీలించారు.

ఉత్సాహంగా 5కే రన్



5కే రన్‌లో పాల్గొన్న వైద్యులు, విద్యార్థులు

ఎంజీఎం: నేషనల్ సర్జన్స్ డేను పురస్కరించుకొని ఏఎస్ఐ వరంగల్ బ్రాంచ్ ఐఎంఏ వరంగల్ డిపార్టమెంట్ ఆఫ్ సర్జరీ, కేఎంసీ ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యాన గురువారం కేఎంసీ నుంచి ఐఎంఏ హాల్ వరకు 5కే రన్ నిర్వహించారు. ఏఎస్ఐ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ మోహన్‌దాస్, ఐఎంఏ వరంగల్ అధ్యక్షుడు డాక్టర్ నాగార్జునరెడ్డి జెండా ఊపి రన్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏఎస్ఐ ప్రధాన కార్యదర్శి కూరపాటి రమేశ్ మాట్లాడుతూ ఈ రన్ ద్వారా ప్రజల్లో ఆరోగ్యంపై అవగాహన పెంపొందించడమే కాకుండా సర్జన్ల పాత్రను సమాజానికి వివరిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో సర్జన్ డాక్టర్లు శ్రీనివాస్‌గౌడ్, నాగేందర్, విద్యాసాగర్, రూప, కార్తీక్, కేఎంసీ ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్, పీజీ, నర్సింగ్ విద్యార్థులు పాల్గొన్నారు.

ఎయిర్‌పోర్ట్ రోడ్లకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలి

న్యూశాయంపేట: మామునూరు ఎయిర్‌పోర్ట్ రోడ్ల కనెక్టివిటీ కోసం వెంటనే ప్రతిపాదనలు సిద్ధం చేయాలని కలెక్టర్ డాక్టర్ సత్యశారద అధికారులను ఆదేశించారు. సంబంధిత శాఖల అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో గురువారం ఆమె పర్యటించారు. రోడ్ల నిర్మాణం చేపట్టే ప్రదేశాలను పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గుంటూరుపల్లి నుంచి నేషనల్‌హైవే వరకు, నక్కలపల్లి నుంచి గాడిపల్లి–గాడిపల్లి బైపాస్ వరకు రోడ్ల స్థలాలను పరిశీలించి ప్రభుత్వానికి పంపడానికి త్వరితగతిన ప్రతిపాదనలు సమర్పించాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఆర్అండ్‌బీ అధికారి రమేశ్, ఆర్డీఓ సత్యపాల్‌రెడ్డి, ఇరిగేషన్ డీఈ మధుసూదన్, తహసీల్దార్ నాగేశ్వర్‌రావు, అధికారులు పాల్గొన్నారు.

భూనిర్వాసితులకు త్వరితగతిన పరిహారం

ఇన్నర్ రింగ్ రోడ్డు నిర్మాణంలో భూములిచ్చిన భూనిర్వాసితులకు పెండింగ్‌లో ఉన్న పరిహారాన్ని త్వరితగతిన చెల్లించాలని కలెక్టర్ డాక్టర్ సత్యశారద అధికారులను ఆదేశించారు. ఇన్నర్ రింగ్‌రోడ్డు భూనిర్వాసితులకు పరిహారం చెల్లింపు, కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కులో రాజీవ్ మెగా టౌన్‌షిప్ లేఔట్ అనుమతుల పురోగతి తదితర అంశాలపై కలెక్టరేట్‌లో గురువారం కుడా చైర్మన్ ఇనుగాల వెంకట్రావిఎరెడ్డితో కలిసి అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గొర్రెకుంట, ఏనుమాములతోపాటు ఖిలా వరంగల్ మండలంలోని పలు గ్రామాలకు చెందిన రింగ్‌రోడ్డు భూ నిర్వాసితులకు త్వరితగతిన పరిహారాన్ని చెల్లించాలన్నారు. మెగా టెక్స్‌టైల్ పార్కులో రాజీవ్ మెగా టౌన్‌షిప్ ఏర్పాటుకు లేఔట్ అనుమతులు మంజూరు చేయాలని అధికారులకు సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, కేఎంటీపీ జోనల్ మేనేజర్ స్వామి, ఆర్డీఓ సత్యపాల్‌రెడ్డి, కుడా పీఓ అజిత్‌రెడ్డి, తహసీల్దార్లు నాగేశ్వర్‌రావు, రాజ్‌కుమార్, మహ్మద్ ఇక్బాల్, రియాజుద్దీన్, అధికారులు పాల్గొన్నారు.



అధికారులకు సూచనలు చేస్తున్న కలెక్టర్ సత్యశారద

అస్తవ్యస్తంగా వార్డుల విభజన

నర్సంపేట: నర్సంపేట సెకండ్ గ్రేడ్ మున్సిపాలిటీలో వార్డుల విభజన ప్రక్రియ అస్తవ్యస్తంగా మారింది. ఇటీవల 8 గ్రామపంచాయతీలు మున్సిపాలిటీలో విలీనమయ్యాయి. కాగా, రాజకీయ పార్టీలతో పాటు విలీన గ్రామాల ప్రజలు ఓట్లు రెండు, మూడు వార్డుల్లో ఉండడాన్ని అంగీకరించడం లేదు. గతంలో 24 వార్డులు ఉండగా వారం రోజుల క్రితం రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన గెజిట్ నోటిఫికేషన్‌తో మున్సిపాలిటీలో మహేశ్వరం, మగ్దుంపురం, రాజపల్లి, రాములునాయక్‌తండా, పర్శనాయక్‌తండా, నాగుర్లపల్లి, మాదన్నపేట, ముత్తోజిపేట విలీనమయ్యాయి. దీంతో ఓటర్ల సంఖ్య 40,561, వార్డుల సంఖ్య 30కి చేరింది. దీని ద్వారా మున్సిపాలిటీ అధికారులు చేసిన వార్డుల విభజనపై విమర్శలు వస్తున్నాయి.

రెండుమూడు వార్డుల్లో ఒక గ్రామ ఓటర్లు

ఒక్కో గ్రామానికి చెందిన ఓటర్లను రెండు మూడు వార్డుల్లో కేటాయించడంతో గందరగోళం నెలకొంది. మున్సిపాలిటీలో విలీనమైన మగ్దుంపురంలో 2,026 మంది ఓటర్లు ఉండగా కొన్ని ఓట్లు పదో వార్డులో కలిపారు. మిగిలిన 1,420 ఓట్లను మగ్దుంపురం 11వ వార్డుగా అధికారులు ఏర్పాటు చేశారు. మరికొన్ని ఓట్లను రాజపల్లిలో కలిపి 12వ వార్డుగా చేశారు. మహేశ్వరంలోని 2,993 ఓట్లను కొన్ని రాములుతండాలో కలిపి 13వ వార్డుగా ఏర్పాటు చేశారు. 1,451 ఓట్లతో మహేశ్వరం పేరుతో 14వ వార్డు విభజించారు. మరో 589 ఓట్లను పట్టణంలోని 25వ వార్డు పోచమ్మగుడి ఏరియాలో చేర్చారు. మాదన్నపేటలో 2006 ఓట్లు ఉండగా 1,489 ఓట్లతో 1వ వార్డు చేశారు. మిగిలిన ఓట్ల విషయంలో ఎలాంటి స్పష్టత లేకపోవడంతో గందరగోళం నెలకొంది.



నర్సంపేట మున్సిపల్ కార్యాలయం

అభ్యంతరాల వెల్లువ..

వార్డుల విభజన విషయంలో వినతులను స్వీకరించిన మున్సిపాలిటీకి కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీతో పాటు విలీన గ్రామాల నుంచి కూడా అభ్యంతరాలు వెల్లువెత్తాయి. విలీన గ్రామాల్లోని ఓటర్లకు ప్రత్యేక వార్డులు ఏర్పాటు చేయాలని బుధవారం పలువురు వినతిపత్రాలు అందించారు. కొత్త వార్డులను సవరించాలని పలు పార్టీల నాయకులు సమర్పించిన వినతిపత్రాలను అధికారులు పరిశీలించి చర్యలు తీసుకునేందుకు కార్యాచరణ ప్రారంభించినట్లు మున్సిపాలిటీ టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ వీరస్వామి తెలిపారు.

మున్సిపాలిటీ పరిధిలో ఓటర్ల వివరాలు..

ప్రాంతం	పురుషులు	మహిళలు	మొత్తం
నర్సంపేట టౌన్	13,987	15,324	29,311
ముగ్దుంపురం	967	1,059	2,026
మహేశ్వరం	1,458	1,535	2,993
రాములునాయక్‌తండా	240	256	496
రాజపల్లి	573	594	1,167
మాదన్నపేట	744	754	1,498
నాగుర్లపల్లి	448	468	916
పర్శనాయక్‌తండా	247	259	506
ముత్తోజిపేట	761	885	1,646

సమష్టి కృషితో ఉత్తమ ఫలితాలు

- పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రభాకర్

రామన్నపేట: విద్యార్థులు, అధ్యాపకుల సమష్టి కృషితో టీజీఈసెట్‌లో ఉత్తమ ఫలితాలు సాధ్యమయ్యాయని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ బైరి ప్రభాకర్ అన్నారు. గురువారం కళాశాల ఆవరణలో టీజీఈసెట్–2025లో ఉత్తమ ప్రతిభ కబర్చి రాష్ట్ర స్థాయిలో ర్యాంకులు సాధించిన పలువురు విద్యార్థులను ప్రిన్సిపాల్‌తోపాటు అధ్యాపక బృందం అభినందించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ బైరి ప్రభాకర్ మాట్లాడుతూ.. విద్యార్థులు టాప్ ర్యాంకులు సాధించడం కళాశాలకు ఎంతో గర్వకారణమని, ఈ స్ఫూర్తిదాయక ప్రదర్శన ఇతరులకు ఆదర్శంగా నిలుస్తుందని చెప్పారు. భవిష్యత్‌లో వారు మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.



టీజీఈసెట్‌లో ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులతో కళాశాల అధ్యాపకులు

లోక్ అదాలత్‌ను వినియోగించుకోవాలి

వరంగల్ క్రైం: ఈనెల 14న నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌ను కక్షిదారులు వినియోగించుకోవాలని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్‌సింగ్ సూచించారు. ప్రధానంగా క్రిమినల్, సివిల్, ఆస్తి, బ్యాంకు రికవరీ, విద్యుత్ చౌర్యం, చెక్‌బౌన్స్ వంటి రాజీపడదగిన కేసులను పరిష్కరించుకోవాలన్నారు. చిన్న కేసులతో కక్ష పెంచుకుని కోర్టుల చుట్టూ తిరిగి సమయాన్ని, డబ్బులను వృథా చేసుకోవద్దని పేర్కొన్నారు. పోలీస్ అధికారులు, కోర్టు కానిస్టేబుళ్లు, రాజీపడదగిన కేసుల్లో ఇరు వర్గాలను పిలిపించి కౌన్సెలింగ్ నిర్వహిస్తారని, రాజీపడాలని అనుకునే వారు సంబంధిత పోలీస్ అధికారులను సంప్రదించాలని పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్‌సింగ్ కోరారు.

అరుణాచలానికి ఆర్టీసీ ప్రత్యేక బస్సు

హన్మకొండ: తమిళనాడులోని అరుణాచలం గిరి ప్రదక్షిణకు వెళ్లి వచ్చే భక్తుల సౌకర్యార్థం ఆర్టీసీ ప్రత్యేక బస్సు నడుపుతున్నట్లు వరంగల్ రీజినల్ మేనేజర్ దర్శనం విజయభాను తెలిపారు. వరంగల్–1 డిపో సూపర్ లగ్జరీ బస్(సర్వీస్ నంబర్ 92222) ఈనెల 27న మధ్యాహ్నం 3గంటలకు హనుమకొండ జిల్లా బస్‌స్టేషన్ నుంచి బయలుదేరి 28న ఉదయం 6 గంటలకు ఆంధ్రప్రదేశ్‌లోని కాణిపాకం చేరుకుంటుందని పేర్కొన్నారు., విఘ్నేశ్వరుడి దర్శనం అనంతరం బయలుదేరి మధ్యాహ్నం 1 గంటకు వెల్లూరులోని శ్రీ మహాలక్ష్మి అమ్మవారి సన్నిధికి చేరుకుంటుందన్నారు. ఇక్కడ దర్శనం అనంతరం రాత్రి 7 గంటలకు అరుణాచలానికి చేరుకుంటుందని ఒక ప్రకటనలో వివరించారు. గిరి ప్రదక్షిణ పూర్తయిన తర్వాత 29న మధ్యాహ్నం బయలుదేరి 30న ఉదయం శ్రీ జోగులాంబ అమ్మవారి శక్తిపీఠం,తర్వాత బీచుపల్లి హనుమాన్ దర్శనం అనంతరం హనుమకొండకు బయలుదేరుతుందన్నారు. ఈ ప్యాకేజీ ధర పెద్దలకు రూ.5,000, పిల్లలకు రూ.3,500 నిర్ణయించినట్లు తెలిపారు. ఆర్టీసీ వెబ్‌సైట్‌లో ముందస్తు రిజర్వేషన్ చేసుకోవచ్చని, పూర్తి సమాచారానికి 9063407493, 7780565971 నంబర్లలో సంప్రదించాలన్నారు.

జల దోపిడీపై రైతులు చైతన్యం కావాలి

- మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న పెద్ది సుదర్శన్‌రెడ్డి

నర్సంపేట: రాష్ట్రంలో జరుగుతున్న జల దోపిడీపై ప్రజలు, రైతులు చైతన్యం కావాలని నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి కోరారు. ఈ మేరకు పార్టీ ముఖ్య నాయకులతో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్‌లోని ప్రాజెక్టులకు సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం సహకరిస్తోందని ఆరోపించారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై రేవంత్‌రెడ్డి బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. కేంద్రంతో కలిసి తెలంగాణలోని ప్రధాన సాగునీటి ప్రాజెక్టులను ఎండబెట్టే ప్రయత్నం జరుగుతోందని పేర్కొన్నారు. జిల్లాను సస్యశ్యామలం చేసే దేవాదుల, సీతారామ, రామప్ప–పాకాల, రంగాయ చెరువు లాంటి ప్రధాన ప్రాజెక్టులను విస్మరిస్తున్నారని మండిపడ్డారు. కేసీఆర్‌ను బుధవారం ఘోష్ కమిషన్ ముందుకు పిలిపించి రాక్షసానందం పొందిన కాంగ్రెస్ ప్రభుత్వం తగిన మూల్యం చెల్లించక తప్పదని హెచ్చరించారు. ఆరు గ్యారంటీలు అమలు చేయలేక కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, మంత్రులు, ప్రజాప్రతినిధులు ప్రజలకు దూరంగా తప్పించుకు తిరుగుతున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించే దమ్ము లేదని తెలిపారు. గ్రామాలు, పట్టణాల్లో బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధి మాత్రమే కనిపిస్తోందని, ఎప్పుడు ఎన్నికలు జరిగినా పార్టీ విజయం సాధిస్తుందని పెద్ది ధీమా వ్యక్తం చేశారు.

పూజారుల భవనం ప్రారంభం



పూజారుల భవనాన్ని ప్రారంభిస్తున్న మంత్రి సీతక్క

ఎస్ఎస్‌తాడ్వాయి: మండలంలోని మేడారంలో రూ. కోటి 98 లక్షలతో నిర్మించి సమ్మక్క, సారలమ్మ పూజారుల సముదాయ భవనాన్ని రాష్ట్ర మంత్రి సీతక్క గురువారం ప్రారంభించారు. అనంతరం మంత్రి సీతక్క.. పూజారులతో సమావేశమై జాతర నిర్వహణపై చర్చించారు. జాతరలో భక్తులకు కల్పించాల్సిన సౌకర్యాలపై పూజారులు మంత్రికి వివరించారు. అంతకుముందు మంత్రి సీతక్క తల్లులను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పూజారులు మంత్రి సీతక్కకు పట్టువస్త్రాలు అందజేశారు. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ మహేందర్‌జీ, గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ రవీందర్, ఈఓ వీరస్వామి, పూజారుల సంఘం అధ్యక్షుడు సిద్ధబోయిన జగ్గారావు, సూపరింటెండెంట్ క్రాంతికుమార్, పూజారులు కాక సారయ్య, అరుణ్‌కుమార్, భోజరావు, కాక కిరణ్, తదితరులు పాల్గొన్నారు.

హేమాచలుడిని దర్శించుకున్న ఎంపీఆర్‌డీ బృందం



పూజలు చేస్తున్న ఎంపీఆర్‌డీ బృందం

మంగపేట: మల్లూరు శ్రీహేమాచల లక్ష్మీనర్సింహస్వామి వారిని మినిస్ట్రీ ఆఫ్ పంచాయతీ(ఎంపీఆర్‌డీ) భారత ప్రభుత్వ న్యూఢిల్లీకి చెందిన రాంబాబుగుప్తా, సమీ అశ్రర్ మిశ్రా బృందం గురువారం దర్శించుకుంది. అనంతరం మండలంలోని వాడగూడెం గ్రామాన్ని సందర్శించి పెసా చట్టం అమలు తీరుపై లఘు చిత్రం చిత్రీకరించారు. కార్యక్రమంలో ఏటూరునాగారం ఐటీడీఏ ఎస్‌డీసీ డీటీ అనిల్, పెసా కోఆర్డినేటర్ కొమరం ప్రభాకర్, టీజీఎండీసీ డీపీఓ మేకల కిరణ్, పెసా మొబిలైజర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు డబ్బుల ముత్యాలరావు, మొబిలైజర్లు పూసం కార్తీక్, మడి శోభన్‌బాబు, పాయం రమేశ్, పూనెం రఘురాం, పున్నం శ్రవణ్, యాలం శ్రీను, తాటి విజయ్‌బాబు పాల్గొన్నారు.

7 నుంచి కరీంనగర్, తిరుపతి వీక్లీ స్పెషల్ ట్రైన్

ఖిలా వరంగల్: జూలై 7వ తేదీ నుంచి కరీంనగర్–తిరుపతి వీక్లీ స్పెషల్ ట్రైన్ నడుపనున్నట్లు రైల్వే అధికారులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జూలై 8న తిరుపతి– కరీంనగర్ వీక్లి వన్స్ ట్రైన్ నడవనుందని పేర్కొన్నారు. ప్రయాణికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

రెండు గంటలు.. 30 మంది అధికారులు

కాజీపేట జంక్షన్‌లో రైల్వే సేఫ్టీ బృందం తనిఖీలు

- ప్రత్యేక స్పీక్ రైలులో కాజీపేటకు చేరుకున్న సౌత్ వెస్ట్రన్ రైల్వే బృందం

కాజీపేట రూరల్ : సౌత్ వెస్ట్రన్ ఇంటర్ రైల్వే సేఫ్టీ ఆడిట్ అధికారుల బృందం గురువారం సికింద్రాబాద్ నుంచి ప్రత్యేక రైలులో కాజీపేట జంక్షన్‌కు చేరుకుంది. రైల్వే గేట్లు, వంతెనలు, సిగ్నల్ పాయింట్లు, ట్రాక్‌ను తనిఖీ చేసుకుంటూ కాజీపేటకు చేరుకున్న సౌత్ వెస్ట్రన్ రైల్వే, దక్షిణ మధ్య రైల్వేకు చెందిన దాదాపు 30 మంది బృంద సభ్యులకు కాజీపేట రైల్వే అధికారులు ఘన స్వాగతం పలికారు. అనంతరం సౌత్ వెస్ట్రన్ రైల్వే హుబ్లీ ప్రిన్సిపాల్ చీఫ్ సేఫ్టీ ఆఫీసర్ రామకృష్ణ నేతృత్వంలో సౌత్ వెస్ట్రన్ రైల్వే, దక్షిణ మధ్య రైల్వే సికింద్రాబాద్, కాజీపేట అధికారులు రైల్వే సీఆర్ఎస్ఈ వి.ఎం.దాస్‌పుత్ర, సీనియర్ డీఈఎన్ కోఆర్డినేషన్



రైల్వే రూట్ రిలే ఇంటర్‌లాకింగ్ సిస్టంలో తనిఖీ చేస్తున్న అధికారుల బృందం

రవీంద్రనాథ్, సీటీపీఎఫ్ దినేశ్, సీనియర్ డీఎస్ఓ సురేశ్, సీఈఎల్ఈ, సీనియర్ డీఎస్‌టీఈ ప్రియ అగర్వాల్, డీఓఎం జనరల్ సుధీర్‌కుమార్, కాజీపేట డీజిల్ సీనియర్ డీఎంఈ వెంకటకుమార్, కాజీపేట ఈఎల్ఎస్ సీనియర్ డీఈఈ ప్రశాంత్ కృష్ణసాయి, డీఈఎన్ సెంట్రల్ ప్రంజల్ కేశర్‌వాణి, ఇతర అధికారులు బృందం వివిధ డిపార్ట్‌మెంట్లలో తనిఖీలు నిర్వహించారు. కాజీపేట రైల్వే స్టేషన్, 140 టన్నుల క్రేన్, యాక్సిడెంట్ రిలీఫ్ ట్రైన్, మెడికల్ రిలీఫ్ వ్యాన్ ట్రైన్, క్యారియజ్ అండ్ వ్యాగన్ డిపో, సిగ్నల్ అండ్ టెలికమ్యూనికేషన్ డిపో, లోకోపైలెట్ కార్యాలయం, రూట్ రిలే ఇంటర్ లాకింగ్ సిస్టం, రైల్వే ఎలక్ట్రిక్‌లోకోషెడ్, డీజిల్ లోకోషెడ్, రైల్వే ఇంజనీరింగ్ డిపో, సిగ్నల్ వ్యవస్థ, పాయింట్లను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. అనుమానం వచ్చిన విషయాలపై ఆరా తీసి నోట్ చేసుకున్నారు. గతంలో పలు చోట్ల జరిగిన రైలు ప్రమాదాలను గుర్తు చేస్తూ అలా జరగకుండా సేఫ్టీ నియమాలు పాటించాలని సలహాలు, సూచనలు చేశారు. మధ్యాహ్నం 3.09 గంటలకు చేరుకున్న అధికారుల బృందం.. రెండు గంటల పాటు క్షుణ్ణంగా తనిఖీలు చేపట్టి సాయంత్రం 5.20 గంటలకు కాజీపేట నుంచి సికింద్రాబాద్‌కు బయలుదేరి వెళ్లారు. అధికారుల బృందం తనిఖీల్లో కాజీపేట రైల్వే స్టేషన్ మేనేజర్ అగ్గి రవీందర్‌తోపాటు అన్ని విభాగాల అధికారులు, సూపర్‌వైజర్లు ఉన్నారు.

వచ్చే ఎన్నికల్లో నేను.. నా కోడలు పోటీచేస్తాం

- మహిళగా నన్ను అవమానించారు
- ఫోన్‌ట్యాపింగ్, స్త్రీనిధి, పీఆర్ అవినీతిలో జైలుకు ఖాయం
- దయాకర్‌రావుపై టీపీసీసీ ఉపాధ్యక్షురాలు ఝాన్సీరెడ్డి ఫైర్



మాట్లాడుతున్న ఝాన్సీరెడ్డి

హన్మకొండ చౌరస్తా: వచ్చే ఎన్నికల్లో నేను.. నా కోడలు ఎమ్మెల్యేగా పోటీ చేస్తామని తెలంగాణ కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షురాలు హనుమాండ్ల ఝాన్సీరెడ్డి అన్నారు. హనుమకొండ అశోకా కన్వెన్షన్ హాల్‌లో గురువారం మీడియాతో నిర్వహించిన ఇష్టాగోష్టిలో ఆమె మాట్లాడారు. పార్టీలకతీతంగా నాటి యతిరాజారావు నుంచి మొన్నటి దయాకర్‌రావు వరకు పాలకుర్తి నియోజకవర్గ అభివృద్ధిలో భాగస్వామ్యులుగా ఉంటున్నాం.. అంతకుముందు ఎన్నికల్లో మద్దతు ఇవ్వాలని జంగా రాఘవరెడ్డి తమను కోరగా.. పార్టీలతో సంబంధం లేకుండా దయాకర్‌రావుకు సపోర్ట్ చేశామన్నారు.

అవమానాలు భరించలేకే రాజకీయాల్లోకి..

దయాకర్‌రావు ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు డబుల్‌బెడ్రూం ఇళ్ల కోసం సొంత ఖర్చుతో స్థలం కొనుగోలు చేసి ఇచ్చాం. స్థలం ఇచ్చే ముందు నా భర్త పేరుపెడతామని చెప్పి చేయలేదు. అప్పటి ప్రభుత్వం పాఠశాల విద్యార్థులకు శానిటేషన్ ప్యాడ్స్ పంపిణీ నిలిపివేస్తే, మా సంస్థ ఆధ్వర్యాన ఇవ్వడానికి ముందుకొచ్చాం. ఆ కార్యక్రమానికి దయాకర్‌రావు రాలేదు. కలెక్టర్, స్కూల్ ఉపాధ్యాయులను సైతం రానివ్వకుండా చేశాడు. మేము చేసే అనేక కార్యక్రమాలను అడ్డుకుంటూ నన్ను అవమానించాడు. అమెరికా వెళ్లాక ఏనాడు రాజకీయాల్లోకి రావాలని అనుకోలేదు. దయాకర్‌రావు చేసిన అవమానాలను తట్టుకోలేకే రావాల్సి వచ్చింది. మంత్రిగా దయాకర్‌రావు నా ఫోన్‌ను సైతం ట్యాపింగ్ చేయించారు. ఫోన్ ట్యాపింగ్, స్త్రీనిధి నిధుల గోల్‌మాల్, పంచాయతీ రాజ్ నిధుల్లో అక్రమాలు ఇలా అనేక విషయాల్లో ఆయన జైలుకు పోవడం ఖాయమన్నారు.

విద్యుత్ ఉద్యోగుల క్రీడా పోటీలు ప్రారంభం



స్పోర్ట్స్ కౌన్సిల్ ఏర్పాటు చేసిన క్రీడా పతాకాన్ని ఆవిష్కరిస్తున్న ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి

వరంగల్ స్పోర్ట్స్: హనుమకొండలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో విద్యుత్ ఉద్యోగుల క్రీడా పోటీలను గురువారం టీజీ ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి ప్రారంభించారు. ముందుగా క్రీడా పతాకాన్ని ఆవిష్కరించిన ఆయన క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ నిరంతరం విధుల్లో ఉంటూ ఒత్తిడికి గురయ్యే ఉద్యోగులకు క్రీడా పోటీలతో మానసిక, శారీరక విశ్రాంతి లభిస్తుందన్నారు. విద్యుత్ సంస్థల్లో పనిచేసే వారందరం అన్నదమ్ములమే.. పోటీల్లో గెలుపు ఓటములను సహజంగా తీసుకోవాలని సూచించారు. స్పోర్ట్స్ కౌన్సిల్ వరంగల్(ఎన్పీడీసీఎల్, ఎస్పీడీసీఎల్, ట్రాన్స్‌కో) ఆధ్వర్యాన ఈనెల 14 వరకు జరిగే ఇంటర్ సర్కిల్ కబడ్డీ, బాల్‌బ్యాడ్మింటన్ క్రీడా పోటీలు ఉంటాయని, కబడ్డీ 12 జట్లు, బాల్‌బ్యాడ్మింటన్ 9 జట్లు పాల్గొంటాయని పేర్కొన్నారు. ఎన్పీడీసీఎల్ ఇన్‌చార్జ్ డైరెక్టర్లు బి.అశోక్‌కుమార్, టి.సదర్‌లాల్, వి.తిరుపతిరెడ్డి, హనుమకొండ ఎస్ఈ పి.మధుసూదన్‌రావు, డీఈ టెక్నికల్ ఎ.విజయేందర్‌రెడ్డి, స్పోర్ట్స్ ఆఫీసర్ జగన్నాథ్, కోశాధికారి ఎం.సంతోష్, కౌన్సిల్ సభ్యులు యాకూబ్‌పాషా,సునీల్ కుమార్, ప్రేమ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

కాళేశ్వరం ప్రాజెక్టును సందర్శించిన ట్రైయినీ కలెక్టర్లు

కాళేశ్వరం: జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలో ట్రైయినీ కలెక్టర్లు సౌరభ్ శర్మ, సలోని చోబ్రా, హర్ష చౌదరి, కెరోలిన్ చింగ్తయానమావి, కొయ్యాడ ప్రణయ్ కుమార్ బృందం గురువారం పర్యటించింది. ఈ సందర్భంగా కాళేశ్వరం అంతర్రాష్ట్ర వంతెనను పరిశీలించి కాళేశ్వరం ప్రాజెక్టు పరిధి కన్నెపల్లిలోని లక్ష్మీ పంప్‌హౌస్‌ను సందర్శించింది. పంపుహౌస్ వివరాలను ఇరిగేషన్ డీఈ సత్యాబాబు వివరించారు. విద్యుత్ వినియోగం, ఎత్తిపోతల వివరాలు, స్టోరేజీ, మోటార్ల సామర్థ్యం, సాగు, తాగు అవసరాల వినియోగంపై వివరించారు. అనంతరం ట్రైయినీ కలెక్టర్ల బృందం మేడిగడ్డ (లక్ష్మి) బ్యారేజీని సందర్శించింది. మహదేవపూర్ డిప్యూటీ తహసీల్దార్ కృష్ణ,



ట్రైయినీ కలెక్టర్లకు మేడిగడ్డ బ్యారేజీ గురించి వివరిస్తున్న ఇరిగేషన్ డీఈ సురేశ్

లైసన్ అధికారి అబ్బాస్, కోర్సు డైరెక్టర్ శ్రీనివాస్, డీఈ సురేశ్ తదితరులు ఉన్నారు. కాగా, ట్రైయినీ కలెక్టర్ సౌరభశర్మ శ్రీకాళేశ్వరముక్తీశ్వరుడిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

రాఘవాపురాన్ని సందర్శించిన కేంద్ర బృందం

- కేంద్ర జలశక్తి పురస్కారానికి ప్రామాణిక అంశాల పరిశీలన

పాలకుర్తి టౌన్: కేంద్ర జలశక్తి పురస్కారానికి ప్రామాణిక అంశాలను పరిశీలించేందుకు గురువారం జనగామ జిల్లా పాలకుర్తి మండలంలోని రాఘవాపురం గ్రామాన్ని కేంద్ర భూగర్భ జలవనరుల శాఖ సైంటిస్టు పి. యాదయ్య, కేంద్ర వాటర్ కమిషన్ సబ్ డివిజన్ ఇంజనీర్ డి. చైతన్య సందర్శించారు. గ్రామంలో పదేళ్లలో భూగర్భ జలాలు పెంచడానికి చేపట్టిన పనులను ఈ బృందం పరిశీలించింది. ఈ సందర్భంగా యాదయ్య, చైతన్య మాట్లాడుతూ గ్రామంలో ప్రభుత్వ నిధులతో చేపట్టిన అభివృద్ధి పనులు అద్భుతంగా ఉన్నాయన్నారు. పురస్కారం అందజేయడానికి దేశంలో 30 గ్రామాలను ఎంపిక చేశామని, ఇందులో తెలంగాణలో రాఘవాపురం



ఇంకుడుగుంతను పరిశీలిస్తున్న కేంద్ర బృందం

గ్రామం ఎంపికైందన్నారు. రాఘవాపురంలో వంద శాతం ఇంకుడు గుంతలు, వంద శాతం మరుగుదొడ్ల నిర్మాణం పూర్తయిందన్నారు. గ్రామంలో చేపట్టిన ప్రతీ అంశాన్ని పరిగణనలోకి తీసుకుని పరిశీలించామన్నారు. నివేదికను కేంద్ర భూగర్భ జలవనరుల శాఖకు అందజేస్తామని తెలిపారు. వారి వెంట డీఆర్‌డీఓ పీడీ వసంత, ఎంపీడీఓ ఆవుల రాములు, ఏపీఓ మంజుల, ఎంపీఓ రవీందర్, పంచాయతీ కార్యదర్శులు మహేందర్, కపిలవాయి వెంకటేశ్వరాచారి, యుగేందర్, శిరీష, ప్రియాంక, మహేశ్‌యాదవ్, లింగయ్య తదితరులు ఉన్నారు.

మరిన్ని పీఎంశ్రీ స్కూళ్ల ఎంపికకు కృషి

- వరంగల్ ఎంపీ కడియం కావ్య

విద్యారణ్యపురి: ఉమ్మడి వరంగల్ జిల్లాలో మరిన్ని పీఎంశ్రీ స్కూళ్ల ఎంపికకు తనవంతు కృషిచేస్తానని ఎంపీ కడియం కావ్య అన్నారు. గురువారం హనుమకొండ జిల్లా కాజీపేట మండలం పోచంపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో నూతన విద్యాసంవత్సరం పాఠశాలల పునఃప్రారంభ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లోని ఉపాధ్యాయులు పోటీపరీక్షల ద్వారానే నియమితులవుతారన్నారు. ఉపాధ్యాయులు అంకితభావంతో పనిచేస్తే సర్కారు బడులు జ్ఞానకర్మాగారాలుగా మారుతాయన్నారు.ఉపాధ్యాయులు నిత్యవిద్యార్థిగా ఉంటూ విద్యార్థులను తీర్చిదిద్దాల్సిన అవసరం ఉందన్నారు. కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ



మాట్లాడుతున్న వరంగల్ ఎంపీ కడియం కావ్య

ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ఇందులో భాగంగా ఆంగ్ల మాధ్యమంలో విద్యాబోధన, కృత్రిమ మేధతో తరగతి గదుల అనుసంధానం డిజిటల్ బోర్డ్స్ ఏర్పాటు చేశారని విద్యాబోధన పద్ధతుల్లో నవీనప్రక్రియలను చేపడుతోందన్నారు. ఈవిద్యాసంవత్సరంలో 135 పాఠశాలల్లో కృత్రిమ మేధ తరగతులను,16 పాఠశాలల్లో పూర్వప్రాథమిక తరగతులను కూడా ప్రారంభిస్తున్నామన్నారు. డీఈఓ డి. వాసంతి మాట్లాడుతూ బడి బాట కార్యక్రమం ద్వారా విద్యార్థుల నమోదు పెంచేందుకు ఉపాధ్యాయులు కృషిచేస్తున్నారన్నారు. కార్యక్రమంలో కమ్యూనిటీ మొబలైజింగ్ కోఆర్డినేటర్ బద్దం సుదర్శన్‌రెడ్డి, ఎంఈఓ బి. మనోజ్‌కుమార్, ఆ పాఠశాల హెచ్ఎం జి. ఉప్పలయ్య, రిటైర్డ్ హెచ్ఎం బి. రాధ, పర్యావరణ పరిరక్షణ సమితి బాధ్యులు, రిటైర్డ్ డీఎఫ్ఓ కాజీపేట పురుషోత్తం, అశోక్‌బాబు, ప్రేరణ ఫౌండేషన్ అధ్యక్షుడు పెండ్లి ఉపేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల జాబితాలో పేరు తొలగించారని..

ధర్మసాగర్: గ్రామ పంచాయతీ కార్యదర్శిని ఓ యువకుడు బుధవారం గదిలో ఉంచి తాళం వేసి నిర్బంధించిన సంఘటన హనుమకొండ జిల్లా ధర్మసాగర్ మండలం రాపాకపల్లిలో గురువారం వెలుగులోకి వచ్చింది. వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామంలో ఇటీవల ఎంపిక చేసిన ఇందిరమ్మ ఇళ్ల జాబితాలో కందుకూరి ప్రశాంత్ అనే యువకుడి పేరు వచ్చింది. ప్రొసీడింగ్ ఇచ్చే సమయంలో అతడి పేరు లేదు. తన పేరు ఎలా తొలగిస్తారంటూ ప్రశాంత్ బుధవారం మధ్యాహ్నం గ్రామ పంచాయతీ కార్యదర్శి భోగి శ్రీనివాస్‌ను ఆఫీస్ గదిలో ఉంచి తాళం వేసి దూషించాడు. దీంతో అతను పోలీసులకు ఫోన్ చేసి విషయం చెప్పగా వారు చేరుకుని ప్రశాంత్‌ను అరెస్ట్ చేసి స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేశారు. ఇదిలా ఉండగా మండలంలో అనర్హులకు ఇందిరమ్మ ఇళ్లు కేటాయించారని, కార్యదర్శులు కూడా అనర్హుల పేర్లనే ఫైనల్ చేశారని ప్రజలు ఆరోపిస్తున్నా అధికారులు పట్టించుకోకపోవడం గమనార్హం.

గోదావరిలో మునిగి వ్యక్తి మృతి

కాళేశ్వరం: కాళేశ్వరంలోని గోదావరి నదిలో పుణ్యస్నానానికి వచ్చిన ఓ వ్యక్తి.. నీట మునిగి మృతి చెందాడు. పోలీసులు, కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. భూపాలపల్లి మండలం కాశీంపల్లికి చెందిన నల్లపూరి రమేశ్ (58) కాళేశ్వరం వెళ్లి గోదావరి నదిలో పుణ్యస్నానం చేసి వస్తానని చెప్పి ఈనెల 10న ఇంటి నుంచి బయలుదేరాడు. అయితే గురువారం ఉదయం గోదావరిలో ఓ మృతదేహం కనిపించడంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందజేశారు. పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని వివరాలు సేకరించి, కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. ఈ ఘటనపై మృతుడి కుమారుడు వెంకటేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తమాషారెడ్డి తెలిపారు.

సునీల్ కుటుంబానికి అండగా ఉంటా..

- రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క

ములుగు రూరల్ : అనారోగ్య కారణాలతో ఇటీవల మృతి చెందిన సాక్షి ములుగు ఆర్‌సీ ఇన్‌చార్జ్ భూక్య సునీల్ కుటుంబానికి అండగా ఉంటానని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి డాక్టర్ ధనసరి సీతక్క అన్నారు. ఈ మేరకు గురువారం సునీల్ కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. ఈ సందర్భంగా సునీల్ చిత్రపటం వద్ద పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆర్థిక సాయం అందించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సునీల్ కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు అందించడంతోపాటు కుటుంబానికి అండగా ఉంటానని హామీ ఇచ్చారు. ఆమె వెంట గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ బానోత్ రవిచందర్, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్, కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు గొల్లపల్లి రాజేందర్, నల్లెల భరత్‌కుమార్, మండల అధ్యక్షుడు చాంద్‌పాషా, తదితరులు పాల్గొన్నారు.



సునీల్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి సీతక్క

వ్యవసాయ సర్వీస్‌లు త్వరగా మంజూరు చేయాలి

- టీజీ ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి

హన్మకొండ: టీజీ ఎన్పీడీసీఎల్‌లోని 16 సర్కిళ్లలో వ్యవసాయ సర్వీస్‌లను త్వరితగతిన మంజూరు చేయాలని ఆ కంపెనీ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కర్నాటి వరుణ్ రెడ్డి ఆదేశించారు. గురువారం హనుమకొండలోని ఎన్పీడీసీఎల్ ప్రధాన కార్యాలయం నుంచి 16 సర్కిళ్ల ఎస్ఈలు, డీఈలు, ఏడీఈలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా వరుణ్ రెడ్డి మాట్లాడుతూ ఇంటర్ లింకింగ్ లైన్లు 68 పూర్తి అయ్యాయని, ఈ నెలాఖరు వరకు మిగతా 97 పనులు పూర్తి చేస్తామన్నారు. ప్రతీ సబ్‌స్టేషన్‌కు ప్రత్యామ్నాయ విద్యుత్ సరఫరా ఉండేలా చూడాలన్నారు. ట్రాన్స్‌ఫార్మర్ల ఫెయిల్యూర్స్ కాకుండా నిర్వహణ చేపట్టాలని, పిడుగుల నిరోధకం అమర్చాలని సూచించారు. పురోగతిలో



మాట్లాడుతున్న ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి

ఉన్న కొత్త సబ్ స్టేషన్ల పనులు వేగవంతం చేయాలన్నారు. పట్టణాల్లో అవసరమైన చోట 8 ఎంవీ పవర్ ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు ప్రతిపాదనలు పంపాలని సూచించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ డైరెక్టర్లు టి.సదర్ లాల్, టి.మధుసూదన్, చీఫ్ ఇంజనీర్ రాజుచౌహాన్, జీఎంలు ఉత్తమ్, సురేందర్, డి.ఈలు అనిల్ కుమార్, ప్రభావతి పాల్గొన్నారు.

టైరు పేలి కారు బోల్తా..

- ఇద్దరు యువకుల దుర్మరణం
- వసంతాపూర్ శివారులో ఘటన

గీసుకొండ: టైరు పేలి కారు చెట్టుకు ఢీకొని బోల్తా పడిన ఘటనలో ఇద్దరు యువకులు మృతి చెందారు. వరంగల్ జిల్లా గీసుకొండ పీఎస్ పరిధిలోని వసంతాపూర్ శివారులో గురువారం సాయంత్రం ఈ ప్రమాదం జరిగింది. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం.. కారులో నలుగురు యువకులు వరంగల్ నుంచి కోట వెంకటాపురం వెళ్లారు. అక్కడి నుంచి తిరుగు ప్రయాణంలో వెంకటాపురం నుంచి వసంతాపురం గ్రామ శివారుకు చేరుకోగా వెనుక ఎడమవైపు టైరు పేలడంతో కారు అదుపు తప్పి చెట్టుకు ఢీకొని పల్టీలు కొట్టి పూర్తిగా ధ్వంసమైంది. దీంతో కారులో ప్రయాణిస్తున్న వరంగల్



షోయబుద్దీన్, షేక్ మహ్మద్ మృతదేహాలు

ఎల్‌బీ నగర్‌కు చెందిన ఎండి. షోయబుద్దీన్(17), వరంగల్ చింతల్‌కు చెందిన షేక్ మహ్మద్(18) అక్కడికక్కడే మృతి చెందారు. ఎల్‌బీ నగర్‌కు చెందిన ఎండి. సమీర్‌పాషా, జాన్‌పాకకు చెందిన ఎండి. ఇస్మాయిల్ అలీకి తీవ్ర గాయాలు కాగా వారిని 108లో ఆస్పత్రికి తరలించారు. గీసుకొండ ఎస్సై ప్రశాంత్‌కుమార్ ఘటనా స్థలిని పరిశీలించి ప్రమాదానికి గల కారణాలను పరిశీలించారు.

నిషేధిత పత్తి విత్తనాలు విక్రయిస్తున్న ఇద్దరిపై కేసు

చిట్యాల: నిషేధిత పత్తి విత్తనాలు విక్రయిస్తున్న ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై శ్రవన్‌కుమార్ తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం.. మండలంలోని నైన్‌పాక, కుమ్మరిపల్లి గ్రామాల్లో నిషేధిత పత్తి విత్తనాలు విక్రయిస్తున్నారనే సమాచారం మేరకు ఎస్సై శ్రవన్‌కుమార్‌తో పాటు, వ్యవసాయశాఖ అధికారి శ్రీనివాస్‌రెడ్డి సోదాలు నిర్వహించారు. నైన్‌పాకకు చెందిన జంగ కుమార్, కుమ్మరిపల్లికి చెందిన బిక్కనూరు విజయ్



స్వాధీనం చేసుకున్న నిషేధిత పత్తి విత్తనాల ప్యాకెట్లు

అనుమతి లేని ఆర్–కాట్–999 బీటీ–5, 32 ప్యాకెట్లు, ది క్యాప్టన్ పింక్ గార్డ్ –5జీ పత్తి విత్తనాలు విక్రయించేందుకు సిద్ధంగా ఉంచుకున్నారు. దీంతో ఆ విత్తనాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ నిషేధిత పత్తి విత్తనాల విలువ రూ.38 వేలు ఉంటుంది. ఈ ఘటనపై ఏఓ శ్రీనివాస్ రెడ్డి ఫిర్యాదు మేరకు ఇద్దరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తునట్లు ఎస్సై పేర్కొన్నారు.

చిత్రకళా ఉపాధ్యాయుడికి అరుదైన గౌరవం

- గూగుల్ వికీపీడియాలో రజనీకాంత్‌కు చోటు

కాటారం: జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం మండల కేంద్రంలోని గిరిజన గురుకుల బాలుర కళాశాలలో చిత్రకళా ఉపాధ్యాయుడిగా విధులు నిర్వర్తిస్తున్న ఆడెపు రజనీకాంత్‌కు అరుదైన గౌరవం దక్కింది. ప్రముఖ సోషల్ మీడియా సంస్థ గూగుల్ రజనీకాంత్ ప్రతిభను గుర్తించి వికీపీడియాలో చోటు ఇచ్చింది. అంతర్జాతీయంగా, జాతీయంగా విభిన్న రంగాల్లో రాణిస్తూ ప్రపంచంలో కొత్త ఆవిష్కరణలు చేసే వారిని గుర్తించి గూగల్ వికీపీడియాలో సమాచారం పొందుపరుస్తారు. రజనీకాంత్ సూక్ష్మకళలో అంతర్జాతీయంగా రాణిస్తూ సుమారు 100కు పైగా విభిన్న ఆకృతుల్లో సూక్ష్మ కళాఖండాలను రూపొందించారు. ఇందుకు గాను ఆర్‌హెచ్‌ఆర్ వరల్డ్ రికార్డు, రికార్డు హోల్డర్ రిపబ్లిక్ ఇండియా రికార్డు, రెండు బుక్ ఆఫ్ స్టేట్ రికార్డులు, తెలుగుబుక్ ఆఫ్ రికార్డు, తెలంగాణ బుక్ ఆఫ్ రికార్డు, సృజనపుత్ర అవార్డు, ఉత్తమ కళారత్న అవార్డు, గ్రామీణ కళాజ్యోతి అవార్డు, ఉత్తమ



రజనీకాంత్



చాక్‌పీస్‌పై తయారు చేసిన శివలింగాలు

కళాకారుడి అవార్డులు అందుకున్నారు. రెండు బియ్యపు గింజలపై 278 అక్షరాలను, జాతీయగీతం జనగణమన, జాతీయగేయం వందేమాతరం రూపొందించారు. అంతేకాకుండా రజనీకాంత్ గుండుపిన్ను సహాయంతో పెన్సిల్ గ్రాఫైట్‌పై ప్రపంచంలో అతి సూక్ష్మ ఎత్తుకలిగిన గణపతి విగ్రహాన్ని రూపొందించడంతోపాటు చాక్‌పీస్‌లపై 78 జాతీయజెండాలను, 109 శివలింగాలను తయారు చేశారు. రజనీకాంత్ ప్రతిభను గుర్తించి పూర్తి సమాచారం సేకరించి వికీపీడియాలో పొందుపర్చినట్లు వికీపీడియా సమాచార సేకరణకర్త ఆత్రపు మోతీరామ్ తెలిపారు.

పెళ్లికి అడ్డుగా మారిన వరుస..

- కూతురు వరున కావడంతో పెళ్లికి అభ్యంతరం చెప్పిన యువతి
- వేరే సంబంధాలు చూస్తుండగా మనస్తాపంతో ఏఈఈ ఆత్మహత్య

బయ్యారం: ప్రేమికురాలితో కడదాకా జీవిద్దామనుకుంటే వరుస అడ్డురావడంతో జీవితంపై విరక్తి చెందిన ఓ ప్రేమికుడు బలవన్మరణం చెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. నల్లగొండ జిల్లా త్రిపురారం మండలం కాపువారిగూడెం గ్రామానికి చెందిన పానుగోత్ దేవీలాల్(34) మహబూబాబాద్ జిల్లా గార్ల మండలంలో నీటిపారుదలశాఖ ఏఈఈగా విధులు నిర్వర్తిస్తున్నాడు. గత అక్టోబర్‌లో మొదటి పోస్టింగ్ పొందిన దేవీలాల్.. గార్లలో విధులు నిర్వర్తిస్తూ బయ్యారంలో అద్దెకుంటున్నాడు.

పెళ్లికి యువతి నిరాకరణ..

దేవీలాల్‌కు ఉద్యోగం రాకముందు పది సంవత్సరాలుగా తన తండాకు చెందిన ఓ యువతిని ప్రేమిస్తున్నాడు. ఈ క్రమంలో ఆ యువతి వరుసకు కూతురు అవుతుండడంతో పెళ్లికి అభ్యంతరాలొచ్చాయి. దీంతో మనస్తాపం చెంది మొదటిసారి ఆత్మహత్యాయత్నం చేసుకోగా కాలు కోల్పోయాడు. ఆ తర్వాత ప్రభుత్వం ఉద్యోగం సాధించినా ఆ యువతిని మరవలేదు. ఈ క్రమంలో ప్రభుత్వ ఉద్యోగం రావడంతో దేవీలాల్‌కు పెళ్లి చేసేందుకు కుటుంబీకులు సంబంధాలు చూస్తున్నారు. అయితే తాను ప్రేమించిన యువతితో పెళ్లి అయ్యే పరిస్థితి లేకపోవడంతో కొన్ని రోజులుగా డిప్రెషన్‌లో ఉంటున్నాడు. ఈ క్రమంలో పురుగుల మందు తాగే ముందు చివరి ప్రయత్నంగా బుధవారం ప్రేమికురాలితో ఫోన్‌లో మాట్లాడాడు. అయితే వరుస కుదరని ఆ యువతి తెలపడంతో పురుగుల మందు తాగాడు. అనంతరం ఈ విషయాన్ని తమ కార్యాలయంలో పనిచేసే అటెండర్ కుమారుడికి ఫోన్‌లో తెలిపాడు. వెంటనే దేవీలాల్‌ను ఆస్పత్రికి తరలిస్తుండగా మృతి చెందాడు. ఈ మేరకు మృతుడి తండ్రి మంగ్యా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తిరుపతి గురువారం తెలిపారు.



దేవీలాల్(ఫైల్)